

సంగారెడి జిల్లాలో మోస్తరు

సంగారెడ్డి టౌన్, జూన్ 11 : సంగారెడ్డి జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం చిరుజల్లులు కురిశాయి. కంది, సదాశివపేట, మునిపల్లి, పటాన్‌చెరు తదితర మండలాల్లో సాయంత్రం మోస్తరు వర్షం పడింది. జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాల్లో ఉరుములు, మెరుములతో మేఘాలు అలుముకున్నాయి. తొలకరి పలకరించడంతో జిల్లావ్యాప్తంగా వ్యవసాయ పనులు జోరందుకున్నాయి. రైతులు పత్తి విత్తనం వేసుకుంటున్నారు. పొలాలను దుక్కిదున్ని సిద్ధం చేసుకుంటున్నారు.



జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్

ప్రజా శ్రేయస్సు కోసం కృషిచేస్తా..

- జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్

జహీరాబాద్, జూన్ 11 : ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం కృషిచేస్తానని జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్‌షెట్కార్ పేర్కొన్నారు. ఎంపీగా గెలుపొందిన సురేష్‌కుమార్‌షెట్కార్ విజయోత్సవ ర్యాలీని జహీరాబాద్ పట్టణంలో మంగళవారం నిర్వహించారు. అనంతరం షెట్కార్ ఫంక్షన్‌హాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు భారీ మెజారిటీ కట్టబెట్టిన జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. జహీరాబాద్ అభివృద్ధి కోసం తనవంతుగా కృషిచేస్తానని పేర్కొన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం మాజీ మంత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా క్యాకర్తలు చూడాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై నాయకులు, కార్యకర్తలు దృష్టిపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు ముల్తానీపాటిల్, ఆయా మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు నర్సింహారెడ్డి, రాంలింగారెడ్డి, మక్సూద్, హన్మంతరావుపాటిల్, శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కండెం నర్సింహులు, నాయకులు, భాస్కర్‌రెడ్డి, హుగ్గెల్లి రాములు, షాకిర్, ఖాజా మియా, అశోక్, శుక్లవర్ధన్‌రెడ్డి, నరేష్‌గౌడ్, గిరిజషెట్కార్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి హత్య!

- రింగ్‌రోడ్డు పక్కన గుర్తుతెలియని మృతదేహం లభ్యం
- మెడకు ఉరి బిగించిన ఆనవాళ్లు
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



అనుమానాస్పదంగా మృతి చెందిన బాలుడు

పటాన్‌చెరు, జూన్ 11: అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన గుర్తుతెలియని బాలుడి మృతదేహాన్ని పటాన్‌చెరు శివారులోని ముత్తంగి ఔటర్ రింగ్‌రోడ్డు జంక్షన్ వద్ద పొదల్లో మంగళవారం ఉదయం గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంగళవారం ఉదయం ముత్తంగి ఔటర్ రింగ్‌రోడ్డు జంక్షన్ పక్కన కాండిడస్ ఇంటర్నేషనల్ పాఠశాల సమీపంలో సర్వీస్ రోడ్డు పక్కన పొదల్లో బాలుడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. 10-13 ఏళ్ల వయసున్న బాలుడు, మెరూన్ రంగు టీషర్ట్, నీలి రంగు జీన్స్‌ప్యాంటు ధరించి ఉన్నాడు. ఎత్తు 4.4 ఫీట్లు, తెలుపురంగులో ఉన్నాడు. బాలుడి మెడ చుట్టూ ఉరివేసి ఊపిరి ఆడకుండా చేసిన ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. దీంతో పోలీసులు హత్య కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహం సమీపంలో టిఫిన్‌బాక్స్ పెట్టుకునే బ్యాగ్, చెట్టుకొమ్మపై టవల్ లభించాయి. బాలుడి ఆచూకీ తెలియజేసే ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఘటనా స్థలంలోనే హత్య చేశారా లేదా ఎక్కడైనా హత్య చేసి ఇక్కడ పడేశారా అనేది తేలాల్సి ఉంది. మంగళవారం తెల్లవారుజామున ఘటన జరిగినట్లు భావిస్తున్నారు. బాలుడి వివరాలు తెలియకపోవడంతో ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్టు పోలీసులు తెలిపారు. ఎక్కడైనా మిస్సింగ్ కేసు నమోదైందో తెలుసుకునేందుకు అన్ని పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం అందించినట్టు పేర్కొన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు, సర్వీస్ రోడ్డుకు వెళ్లే దారిలోని సీసీకెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. వివరాలు తెలిసినవారు 9712656724, 8712656725 నంబర్లలో పోలీసులకు తెలియజేయాలని ఎస్ఐ రాజేష్‌నాయక్ కోరారు.

పిడుగుపాటుకు మహిళ మృతి



ఎల్లమ్మ (ఫైల్)

చిలప్‌చెడ్, జూన్ 11: పిడుగుపాటుతో మహిళ మృతిచెందిన ఘటన మెదక్ జిల్లా చిలప్‌చెడ్ మండలం సోమక్కపేట పంచాయతీ పరిధిలోని గంగిరెద్దులగూడలో మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గంగిరెద్దుల ఎల్లమ్మ (38) ఇద్దరు పిల్లలతో కలసి జోగిపేట నుంచి చిలప్‌చెడ్ చెరువుకట్ట మీదుగా నడుచుకుంటూ సోమక్కపేటకు వస్తున్నది. ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో వర్షం మొదలైంది. పిల్లలు ముందు నడుస్తుండగా వెనుక వస్తున్న ఎల్లమ్మపై పెద్ద శబ్దంతో పిడుగు పడింది. పిల్లలు వెనక్కి తిరిగిచూడగా ఎల్లమ్మ మృతిచెందింది. మృతురాలికి భర్త ఊశయ్య ఐదుగురు కూతుళ్లు, కొడుకు ఉన్నారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు రాలేదని పోలీసులు తెలిపారు.

సర్కారు బడిలో సమస్యల గంట..!

- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- విద్యావలంటీర్లపై స్పష్టత కరువు
- సగం పాఠశాలల్లోనే 'అమ్మ ఆదర్శ' పనులు
- అసంపూర్తిగా మన ఊరు-మన బడి
- బడుల ప్రారంభం వేళ బదిలీలు, పదోన్నతులు



సంగారెడి ఏపీహెచ్‌బీ కాలనీ ప్రాథమిక పాఠశాలలో కొనసాగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 11 : వేసవి సెలవులు ముగిశాయి. నేటి నుంచి సర్కారు బడులు తెరుచుకోనున్నాయి. పాఠశాలల్లో వసతుల కల్పన, నాణ్యమైన బోధన అందించేందుకు ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నా.. పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చడంలేదు. ఫలితంగా విద్యార్థులు సమస్యల మధ్యనే చదువు కొనసాగించాల్సి వస్తున్నది. ప్రతీ సంవత్సరం లాగే ఈసారి కూడా పాఠశాలల్లో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి.

సంగారెడ్డి జిల్లాలో 5,947 ఉపాధ్యాయ పోస్టులు మంజూరు ఉన్నాయి. ప్రస్తుతం 5,079 మంది పనిచేస్తుండగా, 868 ఖాళీలు ఉన్నాయి. ఈ ఏడాది మరో 160 మంది టీచర్లు ఉద్యోగ విరమణ చేయనున్నారు. దీంతో, పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. గతేడాది టీచర్ల కొరత కారణంగా సుమారు 180 మంది ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై సర్దుబాటు చేశారు. ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు విద్యా వలంటీర్లను నియమిస్తామని ఇటీవల సీఎం రేవంత్ ప్రకటించారు. అయితే, పాఠశాలలు ప్రారంభమవుతున్నా ఇప్పటి వరకు నియామకంపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేదు. అలాగే, జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ మేనేజ్‌మెంట్ పాఠశాలల్లో 551 టీచర్ పోస్టులు మెగా డీఎస్సీ ద్వారా భర్తీ చేస్తామని నోటిఫికేషన్ వెలువరించి దరఖాస్తులు కూడా స్వీకరించారు. కానీ ఇప్పటి వరకు డీఎస్సీ నిర్వహణపై ముందడుగు పడలేదు. డీఎస్సీ నిర్వహిస్తే ఉపాధ్యాయుల కొరత తీరే అవకాశం ఉంది.

జీరో ఎన్‌రోల్‌మెంట్ 47.. సింగిల్ టీచర్ 220

జిల్లాలో జీరో ఎన్‌రోల్‌మెంట్ స్కూళ్లు 47 ఉన్నట్లు విద్యాశాఖ గుర్తించింది. విద్యార్థులు లేని కారణంగా ఆయా బడులకు తాళం వేయగా, ఇక్కడి టీచర్లను వేరే పాఠశాల్లో సర్దుబాటు చేశారు. బడిబాట ద్వారానైనా విద్యార్థులు చేరితే ఆయా పాఠశాలలు ఈసారైనా తెరుచుకునే అవకాశం ఉంటుంది. లేదంటే మరో ఏడాది బడులకు తాళం తప్పదు.

అలాగే, జిల్లాలో సింగిల్ టీచర్ స్కూల్స్ 220 ఉన్నాయి. వాటిలోని సుమారు 60 పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య క్రమంగా పెరిగింది. రేషనలైజేషన్ జరిగితే ఆయా పాఠశాలలకు మరో టీచర్ పోస్టు మంజూరవుతుంది. కానీ రేషనలైజేషన్ పూర్తికాకపోవడంతో ప్రస్తుతానికి మరో టీచర్‌ను సర్దుబాటు చేసి బోధన కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రేషనలైజేషన్ చేయాల్సి ఉంది.

కొత్తగా గ్రామ పంచాయతీల పరిధిలో సర్కారు బడి లేనిచోట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను నెలకొల్పాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు చేపట్టిన సర్వేలో సంగారెడ్డి జిల్లాలోని రాయికోడ్ మండలం మోరట్గా పంచాయతీ, గుమ్మడిదల మండలం రామ్‌రెడ్డిబావి పంచాయతీలలో పాఠశాలలు లేవని గుర్తించారు. ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతి వస్తే ఆ రెండు పంచాయతీల్లో పాఠశాలలు ఏర్పాటు కానున్నాయి.

పెండింగ్‌లోనే మరమ్మతు పనులు

జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద 756 బడుల్లో వివిధ రకాల పనులు చేపట్టారు. తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల నిర్మాణం, మరమ్మతులు నిర్వహించారు. పనులు పూర్తిచేసేందుకు ప్రభుత్వం మే 31 వరకు గడువు ఇచ్చింది. కానీ, గడువు ముగిసినా జిల్లాలో 463 పాఠశాలల్లో మాత్రమే అమ్మ ఆదర్శ పాఠశాల పనులు పూర్తయ్యాయి. ఇంకా 293 పాఠశాలల్లో పనులు పూర్తి కావాల్సి ఉన్నది. గత ప్రభుత్వం హయాంలో చేపట్టిన 'మన ఊరు-మన బడి' పథకం కింద జిల్లాలో 441 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇప్పటి వరకు 48 పాఠశాలల్లో వివిధ పనులు పూర్తయి ప్రారంభించగా.. 38 పాఠశాలల్లో పనులు పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. మిగిలినచోట్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయి. చాలాచోట్ల అర్థాంతరంగా నిలిచిపోయాయి.

అందని పుస్తకాలు, యూనిఫాం

జిల్లాలో 1,297 పాఠశాలలుండగా ఇప్పటివరకు 1,200 పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, 980 పాఠశాలలకు నోట్ పుస్తకాలు, 732 పాఠశాలలకు యూనిఫామ్స్ సరఫరా అయ్యాయి. మిగిలిన పాఠశాలలకు త్వరలోనే పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మరోవైపు బడుల ప్రారంభం వేళ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ చేపట్టడంతో బడిబాటపై ప్రభావం పడే అవకాశం ఉంది.

ఎంఈవోలు లేక పర్యవేక్షణ కరువు

జిల్లాలో ఒక్కరంటే ఒక్క రెగ్యులర్ ఎంఈవో కూడా లేరు. హెచ్ఎంలకే ఎంఈవోల బాధ్యతలు అప్పగించారు. ఒక్కో ఇన్‌చార్జి ఎంఈవో రెండు నుంచి మూడు మండలాల బాధ్యతలు చూస్తున్నారు. ఓవైపు పాఠశాల బాధ్యతలు, మరోవైపు మండల స్థాయి విధులతో బడుల పర్యవేక్షణ ప్రశ్నార్థకంగా మరింది. పర్యవేక్షణ లేకపోవడంతో టీచర్లు సమయ పాలన పాటించడం లేదనే ఆరోపణలున్నాయి. ఇటీవల ఫేషియల్ రికగ్నైజేషన్ అటెండెన్స్ అమలు చేయాలని విద్యాశాఖ నిర్ణయించి, ప్రత్యేక యాప్ కూడా రూపొందించింది. కానీ ఇప్పటి వరకు టీచర్ల సమగ్ర వివరాలు యాప్‌లో నమోదు చేయలేదు.



సంగారెడ్డి పరిధిలోని పోతిరెడ్డిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో నిలిచిన మన ఊరు-మన బడి పనులు



జక్కపల్లిలో బడిబాటలో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్

562 పాఠశాలలో అమ్మ కమిటీలు

ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్య : కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సాపూర్, జూన్ 11: మెదక్ జిల్లాలో 562 పాఠశాలల్లో మహిళల ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం జక్కపల్లిలో బడిబాటలో భాగంగా మంగళవారం ఉదయం అధికారులతో కలిసి ఆయన ఇంటింటి సర్వేలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కూడా నాణ్యమైన విద్యనందిస్తున్నామని చెప్పారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా బడుల్లో అన్ని సదుపాయలను కలిపిస్తున్నామని పేర్కొన్నారు. బడీడు పిల్లలు ఎవరూ బయట ఉండకుండా గ్రామపెద్దలు, అధికారులు చూడాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల చదువును మధ్యలోనే నిలిపివేయకుండా డిగ్రీ వరకు కచ్చితంగా చదివించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ కమలాద్రి, ఎంపీడీవో మధులత, ఎంఈవో బుచ్యానాయక్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

టీబీ నిర్ధారణకు ప్రత్యేక క్యాంపులు

ఆశాల ద్వారా ఇంటికే మందులు : సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



సమావేశంలో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి అర్బన్, జూన్ 11 : టీబీ నిర్ధారణకు జనాభా ఎక్కువ నివసించే ప్రాంతాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి వైద్యాధికారులను ఆదేశించారు. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా టీబీ కంట్రోల్ కమిటీ సభ్యులతో ఆమె సమావేశం నిర్వహించారు. జనసాంద్రత ఎక్కువగా ఉండే పారిశ్రామిక ప్రాంతాల్లో క్రమం తప్పకుండా టీబీ స్క్రీనింగ్, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రైవేటు ఆస్పత్రులకు టీబీ కేసులు వస్తే వెంటనే సమాచారం తెప్పించుకోవాలని సూచించారు. ఎన్‌జీవో సంస్థలు రెగ్యులర్‌గా ఎక్స్‌రే క్యాంపులు నిర్వహించాలని, ప్రైవేటు ఆస్పత్రులకు వచ్చే టీబీ అనుమానితుల నుంచి సేకరించిన శాంపిల్స్‌ను డీఎంసీకి తరలించాలని ఆమె ఆదేశించారు. మహిళా సంఘాల సమావేశాల్లోనూ టీబీపై అవగాహన కల్పించాలని సూచించారు. టీబీ బాధితులకు మందులను ఆశా వర్కర్ల ద్వారా ఇంటి వద్దకే పంపేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.గాయత్రీదేవీ, డీసీహెచ్ఎస్ డా.సంగారెడ్డి, డీటీసీవో డా.రాజేశ్వరి, డీఐవో డా.శశాంక్, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.అనీల్‌కుమార్, ఐఎంఏ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డా.ఉషాకిరణ్, డా.చక్రపాణి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

సదాశివపేట: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందుతున్నదని సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి వల్లూరి పేర్కొన్నారు. మండలంలోని కోనాపూర్‌లో బడిబాట కార్యక్రమంలో మంగళవారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా 756 పాఠశాలల్లో వివిధ పనులు చేపట్టామని, ఇందులో 468 పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఇప్పటివరకు రూ. 29 కోట్లు ఖర్చు చేసినట్టు వివరించారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ధరల దడ

మండుతున్న కూరగాయలు



నారాయణఖేడ్, జూన్ 11: కూరగాయల ధరలు మండుతున్నాయి. కొనుగోలు చేయడానికి జనాలు జంకుతున్నారు. పచ్చిమిర్చి, బీరకాయ, బీర్నీస్, క్యాప్సికం, ధరలు కిలో రూ.100 దాటాయి. సాధారణంగా వేసవిలో, పెళ్లిలు, శుభకార్యాల సీజన్‌లో కూరగాయల ధరలు పెరుగుతుంటాయి. ప్రస్తుతం శుభకార్యాలు లేకపోయినా ధరలు పోటీపడి పెరుగుతుండడంతో జనాలు బెంబేలెత్తుతున్నారు. ధరలు విపరీతంగా పెరగడంతో నారాయణఖేడ్‌లో మంగళవారం సంత వెలవెలబోయింది. మొన్నటి వరకు కిలో రూ.60 ఉన్న పచ్చిమిర్చి రూ.100 దాటింది. బీరకాయ, బీర్నీస్, క్యాప్సికం కూడా కిలో రూ.100 ధర పలికాయి. టమాటా కిలో రూ.30 నుంచి రూ.60కి పెరిగింది. చిక్కుడు కిలో రూ.80, దొండ, బెండ కిలో రూ.60 చొప్పున విక్రయించారు. ఆకుకూరల ధరలు కూడా గత వారంతో పోలిస్తే రెట్టింపయ్యాయి. ఉల్లిగడ్డ కిలో రూ.30 పలికింది. పచ్చళ్ల సీజన్ పూర్తికావస్తున్నప్పటికీ అల్లం, వెల్లుల్లి ధరలు ఇంకా పైపైకి పోతున్నాయి. రూ.500 తీసుకొని మార్కెట్‌కు వెళ్తే వారానికి సరిపడా కూరలు కూడా రావడం లేదని కొనుగోలు దారులు వాపోతున్నారు. మొన్నటి వరకు ఎండల తీవ్రత కారణంగా స్థానికంగా పంటలు లేవని, దూర ప్రాంతాల నుంచి అధిక ధరలకు దిగుమతి చేసుకొని విక్రయించాల్సి వస్తున్నదని వ్యాపారులు పేర్కొంటున్నారు. ఈ నెలాఖరు వరకు ధరలు ఇలాగే పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. మరోవైపు, కూరగాయల ధరలు పెరుగుండడంతో పప్పులతో సరిపెట్టుకుందామంటే.. వాటి ధరలు కూడా ఆకాశనంటుతున్నాయి. కంది పప్పు, పెసర పప్పు కిలో రూ.180 వరకు విక్రయిస్తున్నారు.



పొలంలో కనిపించిన మొసలి

గుంతమర్పల్లిలో మొసలి కలకలం

ఝరాసంగం, జూన్ 11 : మండల పరిధిలోని గుంతమర్పల్లి గ్రామంలో మంగళవారం మొసలి సంచారం కలకలం సృష్టించింది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామ శివార్లలో సింగురు పరివాహక ప్రాంతంలో మొసలిని రైతులు గుర్తించారు. పొలాల్లో పనులను చేసుకునేందుకు వెళ్లి సాయంత్రం తిరిగివస్తుండగా వారికి మొసలి కనిపించిందని తెలిపారు. దీంతో, గ్రామస్థులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందజేశారు. తహసీల్దార్ సంజీవరావు, ఎస్సై రాజిరెడ్డి, అటవీశాఖ అధికారులు మొసలి కనిపించిన ప్రదేశానికి చేరుకుని గాలింపు చేపట్టారు. మొసలి పట్టుబడే వరకు పొలాలకు వెళ్లాలంటేనే భయంగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

సంగారెడ్డి అర్బన్, జూన్ 11 : ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ కొనసాగుతున్నది. జడ్పీ మేనేజ్‌మెంట్‌లో హెడ్‌మాస్టర్లుగా (గ్రేడ్-2) పదోన్నతి కోసం స్కూల్ అసిస్టెంట్లు, సమానమైన కేడర్ పోస్టుల ప్రొవిజినల్ సీనియారిటీ జాబితాను సోమవారం రాత్రి ప్రదర్శించారు. జాబితాపై మంగళవారం ఆన్‌లైన్‌లో అభ్యంతరాలు స్వీకరించారు. అదే విధంగా హెడ్‌మాస్టర్ పోస్టుల ఖాళీలు కూడా ప్రదర్శించారు. కాగా, నేడు హెడ్‌మాస్టర్ల ఫైనల్ సీనియారిటీ జాబితా వెల్లడించే అవకాశం ఉంది. మరోవైపు స్కూల్ అసిస్టెంట్ (స్పెషల్ ఎడ్యుకేషన్) ప్రమోషన్స్ కోసం బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ అర్హత కలిగిన ఎస్జీటీల సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను నేడు మధ్యాహ్నం 2 గంటలకు సంగారెడ్డిలోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు ప్రకటనలో తెలిపారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



బొల్లారంలో మొక్క నాటుతున్న చైర్ పర్సన్ , కమిషనర్

జిన్నారం, జూన్ 11: పర్యావరణ సంరక్షణకు మొక్కలు నాటి సంరక్షించాలని బొల్లారం మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి అన్నారు. మంగళవారం బొల్లారం వైఎస్ఆర్ కాలనీ పార్కులో హరితహారంలో భాగంగా చైర్ పర్సన్ రోజారాణి, కమిషనర్ మంగతాయారు, ఏఈ శ్రీకాంత్‌రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వినోద్ మొక్కలు నాటారు. మున్సిపాలిటీలో హరితహారం లక్ష్యం నెరవేరేలా మొక్కలు నాటి సంరక్షణ కోసం చర్యలు చేపడుతామని చైర్ పర్సన్ అన్నారు.

రాష్ట్రాభివృద్ధిలో మంత్రులు కీలక పాత్రను పోషించాలి

-జహీరాబాద్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్ జగన్

జహీరాబాద్, జూన్ 11: తెలంగాణ నుంచి బీజేపీ తరపున నియమితులైన కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండిసంజయ్ రాష్ట్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జహీరాబాద్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నౌబాద్ జగన్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు వారిపై నమ్మకం ఉంచి పార్లమెంట్‌కు పంపించారని, గతంలో వలె కేంద్రం నుంచి పెద్దమొత్తంలో నిధులను తీసుకువచ్చి ప్రజల ఆకాంక్షను నేరవేర్చేలా కృషిచేయాలన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ మూడోసారి ప్రధానమంత్రి కావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు, బీజేపీతోనే ప్రజలు ఆశించిన అభివృద్ధి జరుగనుందని ఆయన గుర్తు చేశారు.

స్కావెంజర్ల ఏర్పాటుకు ముందుకు వచ్చిన దాతలు

నారాయణఖేడ్, జూన్ 11: ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్యం పనులు చేయడానికి, తాగునీటి సదుపాయం కల్పించడానికి స్కావెంజర్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీంతో పలు పాఠశాలల్లో స్కావెంజర్లను ఏర్పాటు చేయడానికి పలువురు దాతలు ముందుకు వచ్చారు. మండల పరిధిలోని చల్లగిద్ద తండా ప్రాథమిక పాఠశాల, ర్యాకల్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో స్కావెంజర్ల కోసం ఏడాది పాటు వేతనం అందిస్తానని, ఎంపీపీ చాందిబాయి తనయుడు రమేష్ చౌహాన్ తెలిపారు. గంగాపూర్ పాఠశాలలో ఎంపీటీసీ అశోక్‌రెడ్డి, సంజీవన్‌రావు పేట పాఠశాలలో ఎంపీటీసీ భూపాల్‌లు స్కావెంజర్లకు ఏడాదిపాటు వేతనాలు ఇచ్చేందుకు ముందుకు వచ్చారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామిక ప్రాంత సమస్యలు పరిష్కరించాలి



క్లస్టర్ సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య, నాయకులు

జిన్నారం, జూన్ 11: పారిశ్రామిక ప్రాంత సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం కాజీపల్లిలో సీఐటీయూ పారిశ్రామిక క్లస్టర్ సమావేశాన్ని నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజయ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిన్నారం మండలంలోని బొల్లారం, కాజీపల్లి, గడ్డపోతారం, బొంతపల్లి పారిశ్రామికవాడలలో ఈఎస్ఐ ఆసుపత్రులు ఏర్పాటు చేసి కార్మికుల సంఖ్యకు అనుగుణంగా చికిత్సలు అందించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న డిస్పెన్సరీని విస్తరించాలన్నారు. అదేవిధంగా పారిశ్రామికవాడలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలని కోరారు. అతి పెద్ద పారిశ్రామిక వాడ బొల్లారంలో ప్రభుత్వం ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, అదేవిధంగా అన్ని పారిశ్రామిక వాడల్లో రహదారుల ఏర్పాటు, మిషన్ భగీరథ నీటి సరఫరా చేపట్టాలని సమావేశంలో డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీధర్‌రావు, భాస్కర్‌రెడ్డి, శేఖర్, హుస్సేన్, నర్సింహాగౌడ్, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



హుస్నాబాద్, జూన్ 11: హుస్నాబాద్ పట్టణంలోని రేణుకా ఎల్లమ్మ జాతరకు మంగళవారం భక్తులు పోటెత్తారు. అమ్మవారి దర్శనం కోసం దాదాపు ఆరు గంటల పాటు క్యూలో నిలుచున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. అమ్మ వారికి బోనాలు, పట్నాలు వేసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

స్కూల్‌కు వెళ్దాం.. చలో..!

● మొదటిసారి వెళ్లే పిల్లల పట్ల జాగ్రత్త ● మారం చేస్తే నచ్చజెప్పాలి ● జంక్‌ఫుడ్ వద్దు.. నచ్చింది పెడుదాం



మెదక్ కల్చరల్, జూన్ 11: వేసవి సెలవులు ముగిశాయి. పిల్లలు రాత్రి ఆలస్యంగా పడుకుని, పొద్దెక్కేదాక పడుకునే రోజులయిపోయాయి. నేటి నుంచి బడి గంటలు మోగబోతున్నాయి. స్కూళ్లు తెరుస్తున్నారంటే.. 'అబ్బా.. ఇంత తొందర సెలవులు అయిపోయాయి' అని పిల్లలు.. 'పొద్దున్నే లేవాలి.. పిల్లల్ని రెడీ చేయాలి.. టిఫిన్ పెట్టాలి.. మారం చేస్తే బుజ్జగించాలి.. అబ్బా ఎన్ని పనులో..' అని తల్లిదండ్రులు అనుకుంటూ ఉంటారు. ఇక స్కూల్ ఫీజులు, డొనేషన్లు, పుస్తకాలు, నోట్‌బుక్‌లు ఈ తతంగం అంతా సరే సరే. కానీ, ఇంతకాలం సెలవుల్లో ఎంజాయ్ చేసిన పిల్లలకు మళ్లీ స్కూల్‌కు పంపాలంటే, వారికి వారుగా బడికి వెళ్లాలంటే మొదట్లో కొంత ఇబ్బందిగానే ఉంటుంది. కొత్తగా స్కూల్‌కు వెళ్లే పిల్లలు మరింత హైరానా పడుతుంటారు.

మొదటిసారి బడికి పంపుతున్నారా...

పిల్లలను స్కూల్‌కు పంపడం.. అందులోనూ మొదటిసారి బడికి పంపడం అంటే తల్లిదండ్రులకు పెద్ద యుద్ధంలానే ఉంటుంది. పిల్లలను నిద్ర లేపడం బ్రష్, స్నానం చేయించడం, స్కూల్‌కు రెడీ చేయించడం ఒక ఎత్తయితే అవన్నీ స్కూల్ టైం లోపలే పూర్తి చేయాల్సి ఉంటుంది. చెప్పిన వెంటనే విని తయారయ్యే పిల్లల కంటే విసిగించే పిల్లలే ఎక్కువ. అయితే, బడికి వెళ్లనని మారం చేసే పిల్లల విషయంలో తల్లిదండ్రులు విసుగు చెందకుండా వారిని బుజ్జగించి చెప్పాలి. విసిగించే పిల్లలైనా కొన్నిసార్లు చెబితే వింటారు. కొప్పడినా, కొట్టినా కొన్నిసార్లు ప్రయోజనం ఉండదనే విషయాన్ని గమనించాలి. అలా చేస్తే మొదటికే మోసం వస్తుంది.

స్కూల్ ఫోబియా...

కొత్తగా స్కూల్‌లోకి అడుగు పెట్టే చిన్నారుల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. కొత్తగా వెళ్లే పిల్లలు స్కూల్ ఫోబియాతో కొంత అనారోగ్యానికి, అస్తవ్యస్థతకు గురయ్యే అవకాశం ఉంది. అలాంటప్పుడు బలవంతంగా స్కూల్లో ఉంచకూడదు. పాఠశాల యాజమాన్యం కానీ, క్లాస్‌టీచర్ కానీ పిల్లల సమాచారాన్ని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు చేరవేయాలి. తల్లిదండ్రులు కూడా తమ పిల్లలకు తోటి విద్యార్థులతో ఎలా ఉండాలి, క్లాస్ రూమ్‌లో ఎలా ఉండాలి టీచర్లతో ఎలా ఉండాలి అనే విషయాలు తెలియ చేయాలి. స్కూల్‌లో మొదట్లో ఇచ్చే అసైన్మెంట్, హోంవర్క్ వారికి అర్థమయ్యే రీతిలో వివరించి, వాటి పట్ల ఉన్న భయాన్ని పోగొట్టాలి.

ప్రణాళిక అవసరం

పిల్లలని స్కూల్ పంపే ముందే ఒక ప్రణాళిక రూపొందించుకోవాలి. వేసవి సెలవులు అయిపోతున్నాయి అనే వారం ముందు నుంచే ఏదో ఒక వంకతో పిల్లలను తెల్లవారుజామునే నిద్రలేపాలి. దీంతో స్కూల్ తెరిచేలోగా వారికి స్కూల్ టైంకి లేవడం అలవాటవుతుంది. అలాగే, పై తరగతులకు వెళ్లే వారికి కొత్త పుస్తకాలు, బ్యాగ్స్, షూస్, టిఫిన్ బాక్స్ లాంటివి ఇప్పించాలి. దీంతో వారికి ఎప్పుడెప్పుడు వాటిని తీసుకుని స్కూల్‌కు వెళ్లాలా అన్న ఆసక్తి పెరుగుతుంది.

ఆహారం పట్లా జాగ్రత్త...

స్కూల్‌కు వెళ్లే పిల్లల ఆహారం విషయంలో జాగ్రత వహించాలి. పొద్దున్నే పిల్లకు ఏమి తినిపించాలి. టిఫిన్ బాక్సులలో ఏం ఇవ్వాలి అనే విషయంలో పిల్లలకు ఏది ఇష్టమో అదే ఇవ్వాలి. అయితే, అందులో పోషకాలు ఉండేలా చూసుకోవాలి. జంక్‌ఫుడ్ జోలికి వెళ్లవద్దు. చాలామంది తల్లిదండ్రులు తొందరగా అవుతుందని ఉదయం వేళ గ్లాస్ పాలు, బిస్కట్లతో సరిపుచ్చుతారు. అది సరికాదు. పిల్లలకు కూరగాయలు, సలాడ్స్, ఇంట్లో చేసిన ఆహారపదార్థాలు పెట్టాలి.

చదువు విలువ తెలియజేయాలి



దాదాపు రెండు నెలల సెలవుల తర్వాత మళ్లీ బడికి వెళ్లాలంటే పిల్లలకు భారంగానే ఉంటుంది. సెలవుల్లో హ్యాపీగా గడిపిన వారు మళ్లీ పొద్దున్నే లేచి బడికి వెళ్లడానికి కొంత ఇబ్బంది పడుతారు. అయితే, వారం ముందు నుంచే వారిని పాఠశాలకు వెళ్లేందుకు సిద్ధంగా అలవాట్లు మార్చాలి. వారికి చదువు విలువను తెలియజేయాలి. అలాగే, పిల్లల మానసిక పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలి.

- సురేష్, సైక్రియాట్రీ సోషల్ వర్కర్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, మెదక్

స్కూళ్లకు స్కావెంజర్లు వచ్చేనా..?

కొండపాక, జూన్ 11: నేటి నుంచి పాఠశాలలు పున: ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాలల్లో పారిశుధ్యంపై ఉపాధ్యాయుల్లో బెంగపట్టుకుంది. పాఠశాలల పరిశుభ్రత కోసం నియమించిన స్కావెంజర్ల వ్యవస్థను గతంలో రద్దు చేశారు. పరిశుభ్రత నిర్వాహణను గ్రామపంచాయతీ, మున్సిపాలిటీలకు అప్పగించారు. కానీ వారు అంతంత మాత్రంగానే పని చేయడంతో పాఠశాలల్లో పరిశుభ్రత ప్రశ్నార్థకంగా మారింది. దీంతో కొత్త ప్రభుత్వం స్కావెంజర్ల వ్యవస్థను పునరుద్ధరిస్తామని చెప్పింది. కానీ, పాఠశాలలు ప్రారంభమవుతున్న ఇంకా వారిని నియమించకపోవడంతో పాఠశాలల పరిశుభ్రత పరిస్థితి ఏమిటని వాపోతున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో సర్కారు బడుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కొత్త ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందుకోసం కోట్ల రూపాయలు కేటాయించింది. విద్యాశాఖ ఆధ్వర్యంలో పాఠశాలలకు రంగులు వేస్తూ అందంగా తీర్చిదిద్దుతున్నారు. టాయిలెట్ల మరమ్మతులు, అదనపు టాయిలెట్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ సరిచేయడంతో పాటు విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు, మెరుగు పరచడం చేస్తున్నారు. అయితే, పాఠశాలల్లో పరిశుభ్రత ఎలా అంశాన్ని మాత్రం మర్చిపోయారు.

గతంలో పాఠశాలల్లో పారిశుద్ధ్య పనుల కోసం స్వచ్ఛకార్మికులను నియమించుకొనేందుకు సమగ్ర శిక్ష గ్రాంట్ కేటాయించారు. ఈ క్రమంలోనే సిద్దిపేట జిల్లాలోని 976 పాఠశాలల్లో 1183 మంది స్వచ్ఛ కార్మికులు పనిచేశారు. పాఠశాలలో 40 మందిలోపు విద్యార్థులుంటే రూ. 2000 వేతనంతో ఒకరిని, వంద కంటే ఎక్కువ విద్యార్థులుంటే రూ. 2,500 చొప్పున ఇద్దరు కార్మికులును నియమించారు. ఈ కార్మికులు నిత్యం పాఠశాల ఆవరణ, తరగతి గదులు, టాయిలెట్లను శుభ్రం చేసేవారు. పాఠశాల ఆవరణలోని మొక్కలనూ సంరక్షించేవారు. తర్వాత ఈ పనులన్నీ గ్రామపంచాయతీల వారు చేస్తారని చెబుతూ స్కావెంజర్ల వ్యవస్థను రద్దు చేశారు. పాఠశాలు పున:ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లో తిరిగి స్కావెంజర్లను నియమించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

స్కావెంజర్‌లను నియమించాలి

పాఠశాలను పరిశుభ్రంగా ఉండాలంటే స్కావెంజర్ ల ఏర్పాటు తప్పనిసరి. స్కావెంజర్ లు లేకపోవడం వల్ల పాఠశాలలు అపరిశుభ్రంగా మారి విద్యార్థుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. సీఎం చెప్పినట్టుగా స్కావెంజర్లను వెంటనే నియమించాలి.

- నవ్వాత్ సురేష్, టీపీయూఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

స్కూల్ ఎంపిక విషయంలోనూ..

మొదటిసారి పిల్లలను స్కూల్‌కు పంపాలి అనుకొనే తల్లిదండ్రులు ముందుగా ఆ స్కూల్ స్థితిగతులను పూర్తిగా తెలుసుకోవాలి. పాఠశాలకు విద్యాశాఖ అనుమతులు ఉన్నాయా, అర్హులైన ఉపాధ్యాయులు ఉన్నారా, విద్యాబోధన ఎలా ఉంది, పాఠశాల సిబ్బంది, యాజమాన్యం ఎలా ఉన్నారు, పాఠశాల స్థితిగతులు, ఆటలాడుకోవడానికి ఆవరణలో గ్రౌండ్ ఉందా, మానసిక వికాస నిపుణులు ఉన్నారా, ఇలా ప్రతి ఒక్క విషయాన్ని పరిశీలించి సంతృప్తి చెందాకే పిల్లలను పాఠశాలలో చేర్పించాలి.

జహీరాబాద్‌లో డీఏపీ కొరత..?

● ఆందోళన చెందుతున్న రైతులు



ఆటోల్లో రైతులు డీఏపీని తీసుకు వెళ్తున్న రైతులు

జహీరాబాద్, జూన్ 11: వానకాలం వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో కొందరు ఫర్టిలైజర్ల దుకాణాల వారు ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. అధికారులు ఎరువులకు ఎలాంటి కొరతలేదని చెబుతున్నప్పటికీ జహీరాబాద్‌లోని కొన్ని ఫర్టిలైజర్ దుకాణాల్లో కొన్ని రోజులుగా ఎరువులు స్టాక్ లేవని.. రేపు రమ్మని తిప్పి పంపుతున్నారు. అరువుకు అయితే ఓ రేటు, నగదు ఇస్తే మరో రేటు చొప్పున విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

జహీరాబాద్‌లో 20కి పైగానే ఫర్టిలైజర్ దుకాణాలు ఉండగా, సుమారు 200 టన్నుల డీఏపీ ఉందని అధికారులు చెబుతున్నారు. కానీ, వాస్తవ పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ఏ దుకాణానికి వెళ్లినా స్టాక్ లేదని, రేపు వస్తుందని చెబుతుండటంతో వ్యవసాయ అదను దాటుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే, కొందరికి మాత్రం బస్తాలు.. బస్తాలు డీఏపీ విక్రయిస్తుండగా, తమ వరకు వచ్చేసరికి స్టాక్ లేదని అంటున్నారని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే వారు ముందస్తుగా బుక్ చేసుకున్నారని దుకాణదారులు బుకాయిస్తున్నారు. ఈ విషయమై వ్యవసాయ శాఖ ఏవో ప్రవీణను సంప్రదించగా, దుకాణదారులు రైతులను ఇబ్బంది పెడితే తమ దృష్టికి తీసుకురావాలని, అలాంటి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో ప్రస్తుతానికి అయితే స్టాక్ ఉందని అన్నారు.

రెండురోజులుగా తిరుగుతున్న..

డీఏపీ ఎరువు కోసం రెండురోజులుగా జహీరాబాద్‌కు వస్తున్నా.. నా ముందే డీఏపీ అమ్ముతున్నారు. నాకు మాత్రం స్టాక్ లేదని చెప్పారు. అదనుపై డీఏపీ అత్యవసరం. అందుకే రైతుల డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని కొందరు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. అధికారులు రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి.

అనిల్ రాథోడ్, రైతు, పిచేర్యాగడితాండ



ఎరువులు, విత్తనాల కోసం దుకాణాల్లో రైతులు

జూలై 1 నుంచి నూతన చట్టాల అమలు

● మెదక్ ఎస్పీ బాలస్వామి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మెదక్ ఎస్పీ బాలస్వామి

మెదక్ అర్బన్, జూన్ 11: కొత్త క్రిమినల్ చట్టాలపై పోలీసులు సంపూర్ణ అవగాహన పెంచుకోవాలని ఎస్పీ బాలస్వామి పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులకు, సిబ్బందికి నూతన చట్టాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ జూలై 1 నుంచి భారత ప్రభుత్వం నూతన నేర, న్యాయ చట్టాలు-2023ను అమలులోకి తీసుకొస్తున్న నేపథ్యంలో పలు కేసుల దర్యాప్తు విచారణలో పాటించాల్సిన నూతన విధానాలపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. ప్రతీ పోలీస్ అధికారి, సిబ్బంది కొత్త చట్టాలపై అవగాహన ఉంటేనే రానున్న రోజుల్లో బాధితుల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎలా స్వీకరించాలి, ఏఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేయాలి, స్టేషన్ బెయిల్‌కు ఎవరు అర్హులు, చార్జిషీట్ ఎలా తయారు చేయాలి, నిందితులకు శిక్షలు ఖరారు చేయడంలో దర్యాప్తు అధికారులు ఎలా వ్యవహరించాలనే తదితర అంశాలపై కొత్త చట్టంలో మార్పులు, చేర్పులు చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు రాజేష్, వెంకటరెడ్డి, జిల్లా సీఐ, ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

మేడ్చల్ జోన్‌లో సంగారెడ్డి సర్కిల్...!

● పాలన సౌలభ్యం కోసం విద్యుత్‌శాఖ మార్పులు

● వచ్చే నెల 1 నుంచి అక్కడి నుంచే ఆపరేషన్స్

హైదరాబాద్ సిటీ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ హైదరాబాద్ శివారు ప్రాంతాలు వేగంగా విస్తరించడం.. భారీగా విద్యుత్ డిమాండ్ పెరగడం, లక్షల సంఖ్యలో కొత్త విద్యుత్‌కనెక్షన్లు వస్తుండటంతో తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్‌పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) పాలన సౌలభ్యం, విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలే లక్ష్యంగా భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మేడ్చల్ రూరల్ జోన్ పరిధిలోని సంగారెడ్డి ఆపరేషన్ సర్కిల్‌ను మేడ్చల్ జోన్ కలుపుతున్నట్లు టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ మంగళవారం ఆదేశాలు జారీచేశారు. జూలై 1 నుంచి సంగారెడ్డి ఆపరేషన్ సర్కిల్ నిర్వహణ మేడ్చల్ జోన్ పరిధిలోకి వస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సంగారెడ్డి సర్కిల్ మేడ్చల్ జోన్‌లోకి తీసుకురావడంతో ఈ జోన్‌లో సర్కిళ్ల సంఖ్య మూడుకు చేరింది. ఇప్పటికే మేడ్చల్, హబ్సిగూడ సర్కిళ్లు మేడ్చల్ జోన్ పరిధిలో ఉన్నాయి. గ్రేటర్‌లో పరిధిలో మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ మూడు జోన్లు ఉన్నాయి. మెట్రో జోన్ పరిధిలో బంజారాహిల్స్, హైదరాబాద్ సెంట్రల్, సౌత్, సికింద్రాబాద్ ఆపరేషన్ సర్కిళ్లు పనిచేస్తున్నాయి. రంగారెడ్డి జోన్‌లో సైబర్‌సిటీ, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, వికారాబాద్ సర్కిళ్లు, మేడ్చల్ జోన్‌లో హబ్సిగూడ, మేడ్చల్ సర్కిళ్లు ఉండగా కొత్తగా సంగారెడ్డి సర్కిల్‌ను కలిపారు. సంగారెడ్డి సర్కిల్‌లో పటాన్‌చెరువు, జహీరాబాద్, జోగిపేట, సంగారెడ్డి డివిజన్లు ఉండగా మొత్తం 7.91 లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. ఇండస్ట్రియల్ ఏరియాతోపాటు ఎక్కువ అపార్ట్‌మెంట్లు, కొత్తకాలనీలు ఏర్పాటు అవుతుండటంతో విద్యుత్‌శాఖ ఈ మార్పులు చేసింది. ముఖ్యంగా బీరంగూడ, ఆర్సీపురం, అమీన్‌పూర్, బోల్లారం, పటాన్‌చెరువు వంటి ప్రాంతాల్లో విద్యుత్‌డిమాండ్ రికార్డు స్థాయిలో పెరుగుతుంది. ఈ నేపథ్యంలో నగరంలో ఎలాంటి విద్యుత్ సరఫరా వ్యవస్థ ఉందో అదే తరహాలో శివారు ప్రాంతాల్లో విద్యుత్ వ్యవస్థ ఏర్పాటు చేయడంతో పాటూ భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని సర్కిళ్లను విద్యుత్‌శాఖ విస్తరిస్తోంది.

ఆశా వర్కర్లకు పరీక్షలు వద్దు: సీఐటీయూ

కొల్చారం, జూన్ 11: ఆశా వర్కర్లకు పరీక్షలు పెట్టాలనే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు కె. నర్సమ్మ కోరారు. మంగళవారం ఆశాడే సందర్భంగా కొల్చారంలో ఎంహెచ్‌పీ మోహన్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నర్సమ్మ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆశ వర్కర్లు గిరిజన ప్రాంతాల్లో 33 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారని, ప్రారంభం నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి అనేక రకాల శిక్షణ పొందినట్లు తెలిపారు. రిజిష్టర్లు రాయడం, ఆన్‌లైన్ పనిచేయడం, ప్రజలకు మందులు అందజేయడం, గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు, ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారన్నారు. కరోనాను నియంత్రిచండంలో ఆశ వర్కర్లు ప్రముఖ పాత్ర పోషించారన్నారు. వీరికి ప్రపంచ ఆరోగ్య సంస్థ లీడర్స్ అని ప్రకటించిందన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ప్రతి నెల రెండవ తేదీనే వేతనాలు ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న సర్వేల డబ్బులు వెంటనే చెల్లించాలని అన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, రిటైర్మెంట్ సౌకర్యం కల్పించాలని డిమాండు చేశారు. కార్యక్రమంలో లక్ష్మి, గీత, సబిత, సంసీల, నాగమణి, చంద్రకళ, నాశమ్మ, రమ్య, మాధవి తదితరులు పాల్గొన్నారు.



హైనా దాడిలో మృతి చెందిన మేకలు, గాయపడిన దూడ

భయపెడుతున్న హైనా

● మరోసారి దాడి.. రెండు మేకలు మృతి

చిన్నకోదూరు, జూన్ 11: చిన్నకోదూరు మండలంలో హైనా మరోసారి తన పంజా విసిరింది. మాచాపూర్, మెట్టుపల్లి గ్రామాల్లో ఇటీవల హైనా దాడిలో 65 జీవాలు (గొర్రెలు, మేకలు), ఒక దూడ మృతి చెందగా 20 జీవాలకు, 3 పశువులకు తీవ్రగాయాలయ్యాయి. మంగళవారం తెల్లవారు జామున చంద్లాపూర్ గ్రామంలో హైనా దాడిలో రెండు మేకలు మృతి చెందగా, ఓ దూడకు తీవ్ర గాయాలు అయ్యాయి. చంద్లాపూర్ గ్రామానికి చెందిన రైతు బాల్లింగ్ వెంకటయ్య రోజు మాదిరిగానే సోమవారం సాయంత్రం రెండు మేకలను, ఓ దూడను తన వ్యవసాయ బావి వద్ద ఏర్పాటు చేసిన ఇనుప జాలి పెన్సింగ్‌లో వదిలి ఇంటికి వెళ్లాడు. మంగళవారం తెల్లవారు జామున వచ్చి చూడగా రెండు మేకలు మృతి చెంది, దూడకు తీవ్ర గాయాలై ఉన్నాయి. సమాచారం అందుకున్న ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ సంఘటన స్థలానికి చేరుకొని మేకలు, దూడపై దాడి చేసిన ఆనవాళ్లను బట్టి హైనాగా గుర్తించారు. గాయాలైన దూడకు పశు వైద్య సిబ్బంది చికిత్స అందించారు. పరిహారం అందించాలని బాధిత రైతు వెంకటయ్య ప్రభుత్వాన్ని కోరాడు. చుట్టూ పక్కల గ్రామాల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ శ్రీకాంత్ సూచించారు. హైనా వరుస దాడులతో చుట్టూ పక్కల గ్రామాల రైతులు భయాందోళనకు గురవుతున్నారు.



మర్మాములలో లారీ ఓనర్ ఇంటిముందు బైఠాయించిన కుటుంబ సభ్యులు

నా భర్త ఆచూకీ చెప్పండి

● లారీ ఓనర్ ఇంటిముందు బైఠాయించిన వివాహిత

మద్దూరు, జూన్ 11: లారీ క్లీనర్‌గా పని చేయాలంటూ తన భర్తను తమిళనాడు పంపి, అతను కనిపించకుండా పోయేందుకు కారణమైన లారీ ఓనర్ తన భర్త ఆచూకీ చెప్పాలంటూ బాధితురాలితో సహా ఆమె కుటుంబ సభ్యులు మంగళవారం ఆందోళనకు దిగారు. మద్దూరు మండలం మర్మాముల గ్రామంలో చోటు చేసుకున్న ఘటన వివరాలు బాధితురాలి కథనం ప్రకారం.. గ్రామానికి చందిన యాటెల్లి శ్రీకాంత్ కూలి పనులు చేస్తుంటాడు. అదే గ్రామానికి చెందిన లారీ ఓనర్ బత్తిని కనకయ్య గత నెల 3న యాటెల్లి శ్రీకాంత్‌ను లారీ క్లీనర్‌గా పని చేసేందుకు స్థానిక డ్రైవర్ పున్నంచందర్‌రెడ్డితో కలిపి తమిళనాడుకు పంపించాడు. అక్కడి నమ్మకల్ జంక్షన్‌లో తన వద్ద రూ. 200 తీసుకుని వెళ్లిన శ్రీకాంత్ తిరిగి రాలేదని డ్రైవర్ చెబుతున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి నమ్మకల్ పోలీస్‌స్టేషన్ సహా పలు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. పలు చోట్ల వెతికినా శ్రీకాంత్ ఆచూకీ దొరకలేదు. ఈ మేరకు శ్రీకాంత్ ఫొటోతోపాటు ఆచూకీ తెలిపిన వారికి రూ. 10 వేలు బహుమతిగా ఇస్తామని కూడా పోస్టర్లు వేసినా ఫలితం లేకుండా పోయింది. అంతటితో ఆగకుండా తమిళనాడుతో తన భర్తతో గొడవ పడి.. అతడు కనిపించకుండా పోవడానికి కారణమైన డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని గత నెల 15న శ్రీకాంత్ భార్య యాటెల్లి కవిత మద్దూరు పోలీసులకూ ఫిర్యాదు చేశారు. నెల రోజులు కావొస్తున్నా భర్త ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం అత్త యాటెల్లి తార, మరది రమేష్‌తోపాటు పిల్లలు బంధువులతో కలిసి యాటెల్లి కవిత లారీ ఓనర్ ఇంటిముందు బైఠాయించింది. తన భర్త ఆచూకీ చెప్పాలని ఆందోళనకు దిగింది. సమాచారం అందుకున్న మద్దూరు ఏఎస్ఐ జగదీశ్వర్ సిబ్బందితో కలిసి వెళ్లి ఆందోళన చేస్తున్న వారిని సముదాయించారు. ఇరువర్గాలను చేర్యాల సీఐ కార్యాలయానికి తరలించారు. చేర్యాల సీఐ శ్రీను వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, తమిళనాడు పోలీసులతో మాట్లాడి వారికి కేసును బదిలీ చేశారు. దీంతో గొడవ సద్దు మణిగింది.

సర్కారు బడుల్లోనే నాణ్యమైన విద్య



కొల్చారం: అంసాన్‌పల్లిలో చిన్నారికి అడ్మిషన్ అందజేస్తున్న డీఈవో రాధాకిషన్



తూప్రాన్: కోనాయపల్లి పీటీలో బడిబాట ర్యాలీలో జడ్పీ సీఈవో ఎల్లయ్య



అల్లాదుర్గం: అల్లాదుర్గంలో విద్యార్థులతో కలసి బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు



చేగుంట పంచాయతీ కార్యాలయంలో పల్లెనిద్ర చేస్తున్న ఉపాధ్యాయులు, ఈవో నాగభూషణం గౌడ్

మెదక్ జిల్లాలో బడిబాట కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం రాత్రి అధికారులు పల్లెనిద్ర చేసి ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించారు. మంగళవారం ఉదయం బడిబాట ర్యాలీలు నిర్వహించి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలంటూ అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులతో పాటు ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

కొల్చారం, జూన్ 11: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని, మౌలిక సదుపాయాలు, ఉచిత పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజన వసతి, ఉచితంగా యూనిఫారం అందజేస్తున్నట్టు డీఈవో ప్రొఫెసర్ డి. రాధాకిషన్ పేర్కొన్నారు. మండలంలోని పోతంశెట్‌పల్లిలో సోమవారం రాత్రి పల్లెనిద్ర చేసిన అనంతరం మంగళవారం ఉదయం పోతంశెట్‌పల్లి, అంసాన్‌పల్లి గ్రామాల్లో బడిబాట ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులకు చదువు పట్ల అవగాహన కల్పించారు. ఆయన వెంట మండల విద్యాధికారి నీలకంఠం, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పొద్దార్ మధుకర్‌రావు, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎల్లేశం, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి అరుంధతి, సీఆర్పీలు పాల్గొన్నారు.వరిగుంతంలో జరిగిన బడిబాటలో పంచాయతీరాజ్ ఏఈ ఇర్ఫాన్ హుస్సేన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగదీశ్వర్, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

● **తూప్రాన్:** మండలంలోని కోనాయపల్లి పీటీలో జరిగిన బడిబాట కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య పాల్గొని ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ స్కూళ్లలో పిల్లలను చేర్పించాలని గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్థులు. పిల్లలు పాల్గొన్నారు.

● **వెల్దుర్తి:** మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో సోమవారం రాత్రి ప్రత్యేక అధికారులు పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం ఉదయం గ్రామాల్లో బడిబాట ర్యాలీలు నిర్వహించి, విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలపై అవగాహన కల్పించారు వెల్దుర్తి ఇన్‌చార్జి ఎంపీడీవో, ఎంపీవో విఘ్నేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

● **మాసాయిపేట:** మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం రాత్రి గామ కార్యదర్శి బాలకిషన్, ఉపాధ్యాయులు, రంగారెడ్డి, భాష, శంకర్ రెవెన్యూ అధికారులు పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని వివిధ సౌకర్యాలను, సమస్యలను పరిశీలించి చేపట్టాల్సిన పనుల నివేదికను రూపొందించారు. ఈ నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్టు తెలిపారు.

● **చేగుంట:** మండల కేంద్రంలో మండలంలోని పలు గ్రామాల్లోని ఉపాధ్యాయులు వివిధ శాఖల అధికారులు సోమవారం రాత్రి పల్లె నిద్ర చేశారు. మంగళవారం ఉదయం ఆయా గ్రామాల్లో తహసీల్దార్ గియాఉన్నిసాబేగం, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళా సంఘాల సభ్యులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామా ల్లో పర్యటించి బడి ఈడు పిల్లలను నమోదు చేశారు. కార్యక్రమంలో ఈవో నాగభూషణంగౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని వడియారం గ్రామంలో నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ప్రత్యేక అధికారి బ్రాహ్మణి పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, సౌకర్యాలతో పాటు ఒనగూరే ప్రయోజనాల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిన్నారెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, పంచాయతీ కార్యదర్శి విజయపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

● **మనోహరాబాద్:** మండలంలో పలు గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, కార్యదర్శులు మంగళవారం పర్యటించి అంగన్‌వాడీలలో పిల్లలను చేర్చాలని ర్యాలీలు నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ నర్సాపూర్ ద్వారా అంగన్‌వాడీలో అడ్మిషన్లు (తెలుగు, ఇంగ్లిష్) మీడియం ఎల్‌కేజీ, యూకేజీ క్లాసులు ప్రారంభమైనట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏడబ్ల్యూటీ నాగరాణి, సుశీల, అనిత, సూర్య, అంగన్‌వాడీ పిల్లలు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

● **అల్లాదుర్గం:** బడిబాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం అల్లాదుర్గంలో బడిబాట ర్యాలీ నిర్వహించారు. అనంతరం బడిమానివేసిన నలుగురు బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి కరుణ, ఎంపీడీవో శంకర్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ధనుంజయగౌడ్, రవి, రాజేశ్వర్ రావు, ఏపీఎం నాగరాజు, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

● **పెద్దశంకరంపేట:** మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన బడిబాట ర్యాలీలో తహసీల్దార్ గ్రేస్‌బాయ్ పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, వసతులను గూర్చి పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుతుందన్నారు. కార్యక్రమంలో నోడల్ అధికారి వెంకటేశం, ప్రధానోపాధ్యాయులు విఠల్, రాజేశ్వర్‌రావు, మారుతి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

● **శివ్వంపేట:** మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన బడిబాట ర్యాలీ కార్యక్రమాన్ని తహసీల్దార్ శ్రీనివాసాచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించేందుకు ఉపాధ్యాయులు పూర్తిబాధ్యత వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో తల్లి, బిడ్డ మృతి ఘటనపై జిల్లా వైద్యాధికారి విచారణ



ఆస్పత్రిలో చికిత్స విధానంపై వివరాలు సేకరిస్తున్న జిల్లా వైద్యాధికారి

రామాయంపేట, జూన్ 11: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో గర్భిణి ప్రసవ సమయంలో పరిస్థితి విషమించి తల్లి, బిడ్డా చనిపోయిన ఘటనపై దర్యాప్తు ముమ్మరం చేశారు. మంగళవారం జిల్లా వైద్యాధికారి ధనసరి శ్రీరామ్, ఉప వైద్యాధికారి విజయ నిర్మల, వైద్య, విధాన పరిషత్ అధికారి శివ దయాళ్ చేరుకుని రెండు గంటల పాటు విచారించారు. సరైన చికిత్స అందక పోవటం వల్లే గర్భిణి పరిస్థితి విషమించిందని, మెరుగైన వైద్యం కోసం తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించిందని బాధిత కుటుంబీకులు విచారణ అధికారులకు సమాచారం అందించారు. ఇక్కడి వైద్యురాలి నిర్లక్ష్యం వల్ల రెండు నిండు ప్రాణాలు పోయాయని ఫిర్యాదు చేయగా అధికారులు విచారణ చేపట్టారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ఇందుకు సంబంధించిన పూర్తి నివేదిక రాష్ట్రస్థాయి అధికారులకు పంపుతామన్నారు. ఆస్పత్రి యాజమాన్యంపై తదుపరి చర్యలు ఏమిటని ప్రశ్నించగా, రాష్ట్ర ఉన్నతాధిర యంత్రాంగం నివేదిక ఆధారంగా ఏం చేయాలో నిర్ణయిస్తుందన్నారు.

రోడ్డు విస్తరణకు భూములిచ్చేందుకు రైతులు ససేమిరా

● **రామాయంపేట తహసీల్ కార్యాలయంలో చర్చలు విఫలం**



భూములు కోల్పోతున్న రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రమాదేవి

రామాయంపేట, జూన్ 11: మెదక్ నుంచి రామాయంపేట మీదుగా ఎల్కతుర్తి వరకు చేపట్టిన రోడ్డు విస్తరణలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులతో ఆర్డీవో రమాదేవి చర్చలు జరిపారు. మంగళవారం తహసీల్ కార్యాలయంలో సదరు రైతులను పిలిచి రోడ్డు పనులకు సహకరించాలని నచ్చజెప్పే ప్రయత్నం చేయగా ఇందుకు బాధిత రైతులు ఒక్క గుంట భూమి కూడా వదలమని తెగేసి చెప్పారు. అంతే కాదు బలవంతంగా లాక్కునే ప్రయత్నం చేస్తే బలిదానాలకైనా వెనుకాడమని హెచ్చరించారు. ఇప్పటికే ఒకమారు హైవే బైపాస్ రోడ్డు కోసం విలువైన భూములు ఇచ్చి నష్ట పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కొద్ది సేపు రైతులు, అధికారుల నడుమ వాగ్వాదం చోటు చేసుకుంది. ఆర్డీవో నచ్చజెప్పేందుకు యత్నించినా ససేమిరా అనడంతో భూ సేకరణ కోసం జరిపిన చర్చలు విఫలమయ్యాయి.

ప్రయాణికుల భద్రతే లక్ష్యంగా పోలీసుల కృషి: డీఎస్పీ



ఆటో స్టిక్కర్లను విడుదల చేస్తున్న డీఎస్పీ

జహీరాబాద్, జూన్ 11: ప్రయాణీకుల భద్రతే లక్ష్యంగా కృషిచేస్తున్నామని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణం లోని పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల ఆధ్వర్యంలో 'మై ఆటో సేఫ్' అనేనినాదంతో ఆటోలకు స్టిక్కర్‌లను అంటించే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జహీరాబాద్ డివిజన్ పరిధిలో సుమారు 500 ఆటోలుండగా వాటన్నింటికి స్టిక్కర్‌లను అతికిస్తున్నామన్నారు. ఆటోగాని, ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణీకులుగాని ఏదో రకంగా ప్రమాదానికి గురైతే ఆటోకు అతికించిన స్టిక్కర్‌పై గల క్యూఆర్‌ను స్కాన్ చేస్తే పూర్తిస్థాయి వివరాలు తెలుస్తాయన్నారు. ఆటోలపై పోలీసులు ఇచ్చిన స్టిక్కర్‌లు లేకపోతే ఆటోలను సీజ్ చేస్తామన్నారు.

నేరాల ఛేదనపై దృష్టి పెట్టాలి

జహీరాబాద్ డివిజన్‌పరిధిలోని ఆయాపోలీస్‌స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల ఛేదనకు పోలీసులు కృషిచేయాలని డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని స్థానిక డివిజన్ కార్యాలయంలో డివిజన్‌స్థాయి ఎస్‌ఐలు, సీఐలతో క్రైం సమావేశం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో సీఐలు రాజబోయిన రవి, నయిమోద్దీన్, ఎస్‌ఐలు లక్ష్మారెడ్డి, నరేష్, ప్రసాద రావు, వెంకట్‌రెడ్డి, రాజిరెడ్డి, రామనాయుడు, క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి తైబజార్ వేలం రూ. 7.35 లక్షలు

వెల్దుర్తి, జూన్ 11: వెల్దుర్తి గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి బలరాంరెడ్డి అధ్యక్షతన 2024-25 సంవత్సరానికి సంబంధించిన తైబజార్ వేలం పాటను మంగళవారం నిర్వహించారు. వేలం పాటలో ఏడుగురు పాల్గొనగా వెల్దుర్తి గ్రామానికి చెందిన కొదండ శేఖర్‌గౌడ్ రూ.7,35,500లకు వెల్దుర్తి తైబజార్‌ను దక్కించుకున్నాడు.

ఆధునిక వ్యవసాయంపై వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయాధికారి, సిబ్బంది

చిన్నశంకరంపేట, జూన్ 11: ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించే విధానంపై మంగళవారం స్థానిక రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా వ్యవసాయాధికారి గోవింద్, ఉప సంచాలకులు వసంత సుగుణ, రాజ్ నారాయణలు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కల్హేర్, జూన్ 11: సంగారెడ్డి జిల్లా నిజాంపేట మండల పరిధిలోని బాచేపల్లి గిరిజన మినీ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి గానూ 1,5 వ తరగతుల్లో ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆర్‌సీవో కళ్యాణి, పాఠశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్యామలాదేవి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఒకటవ తరగతిలో 30, 5వ తరగతిలో 22 సీట్ల భర్తీకి గానూ ఈ నెల 18 వరకు దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 8106803922కు ఫోన్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ

కొండాపూర్, జూన్11: బడిబాట కార్యక్రమంలో బాగంగా మండల కేంద్రమైన కొండాపూర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లను విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో బీంసింగ్, ప్రధానోపాధ్యాయురాలు ఎలిజబెత్, ఖాజామైనోద్దీన్ ఏఎంసీ చైర్మన్‌లు శేఖర్‌గౌడ్, ఉపాధ్యాయులు రజిని మల్లేషం, విద్యార్థులు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూలో ప్రణతికి బ్లాక్‌బెల్ట్



ప్రణతిని అభినందిస్తున్న ట్రైనింగ్ మాస్టర్

కొండాపూర్, జూన్ 11: మండల పరిధిలోని తెర్పోల్ గ్రామానికి చెందిన సీహెచ్ ప్రణతి కుంగ్‌ఫూలో బ్లాక్‌బెల్ట్ సాధించిందని వారియర్ మార్షల్ ఆర్ట్ అకాడమీ ప్రతినిధులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారియర్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఇండియా, ఇంటర్నేషనల్ షావోలిన్ కుంగ్‌ఫూ ఆధ్వర్యంలో సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌లో ప్రణతి పాల్గొన్నారు. గత మూడేళ్లుగా కఠోరంగా శ్రమించడంతో బ్లాక్ బెల్ట్ సాధించినట్లు ఆమె తెలిపింది. బ్లాక్ బెల్ట్ సాధించిన ప్రణతికి బీజేపీ నాయకులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే చేతుల మీదుగా బ్లాక్‌బెల్ట్‌తో పాటు అవార్డును అందించారు.

ప్రజాప్రతినిధులు, అధికారుల మధ్య సమన్వయం తప్పనిసరి

● **ఖేడ్ మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నారాయణఖేడ్, జూన్ 11: అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు కోసం ప్రజా ప్రతినిధులు, అధికారులు సమష్టిగా పని చేయాలని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నారాయణఖేడ్ ఎంపీపీ సమావేశ మందిరంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అధ్యక్షురాలు చాందిబాయిచౌహాన్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు నిబంధనలకు లోబడి పని చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు ప్రజల సమస్యలను దృష్టికి తీసుకు వస్తే వెంటనే పరిష్కరించాలన్నారు. దళారుల వద్ద జొన్నలు, ధాన్యం కొనుగోలుచేసిన అధికారులపై చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మిల్లెట్‌యూనిట్‌ను ఇటీవలే ప్రారంభించగా, అదిప్పుడూ మూసి ఉంటుందన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటూ సీజనల్ వ్యాధులపట్ల ప్రజలకుఅవగాహన కల్పించాలన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రైతులు డీడీలు కట్టి ఏళ్లు గడిచాయని, విద్యుత్‌స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్‌లు ఏర్పాటు చేసినా నేటికీ కనెక్షన్లు ఇవ్వలేదని మండిపడ్డారు. విద్యుత్ కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, అవసరాలకు సరిపడా విద్యుత్ ఉన్నా, ట్రాన్స్ ఫార్మర్ల వద్ద ఏబీ స్విచ్‌లు లేకపోవడంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడి, ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. విద్యుత్ సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించనున్నట్టు తెలిపారు. ప్రస్తుతం సర్పంచులు లేనందున, గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంలో పంచాయతీ కార్యదర్శులు చొరవ తీసుకోవాలని సూచించారు. సమావేశంలోజడ్పీటీసీ లక్ష్మీబాయిరవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలను సభలో చదివి వినిపించారు. సమావేశంలో తహసీల్దార్ భాస్కర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ట్రాన్స్‌కో ఏఈ నారాయణ, ఎంఈవో విశ్వనాథ్ పాల్గొన్నారు.

చెక్కులు అందించిన ఎమ్మెల్యే

ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మంగళవారం స్థానిక ఎమ్మెల్యే సంజీవరెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. మండల పరిధిలోని అనంత్‌సాగర్, గంగాపూర్, తదితర గ్రామాలకు చెందిన ఏడుగురు లబ్ధిదారులకు గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా బర్రెలషెడ్లను ఏర్పాటు చేసుకోవడానికి ఆర్థిక సహాయం మంజూరైంది.ఈ మేరకు ఆ చెక్కులను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధిహామీ ఏపీవో మాణిక్‌రావు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే షాపులను సీజ్ చేస్తాం



సిర్గాపూర్‌లో విత్తనాలు, ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏడీఏ, మండల వ్యవసాయ అధికారి

కల్హేర్/నాగల్‌గిద్ద, జూన్ 11; విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల దుకాణాల్లో నకిలీవి విక్రయిస్తున్నట్టు తమ దృష్టికి వస్తే విచారించి సదరు షాపులను సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నారాయణఖేడ్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు(ఏడీఏ) నూతన్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం సిర్గాపూర్ మండల వ్యవసాయాధికారి శశాంక్‌తో కలిసి మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం రిజిష్టర్లు, బిల్ బుక్కులు పరిశీలించి స్టాకు, ధరలకు సంబంధించిన వివరాలను పరిశీలించారు. రైతులకు విత్తనాలు, ఎరువుల కొరత రానీయకుండా చూడాలని ఏడీఏ నూతన్‌కుమార్, ఏవో శశాంక్ వ్యాపారులకు సూచించారు. అదేవిధంగా నాగల్‌గిద్ద మండల కేంద్రంలో ఏడీఏ నూతన్‌కుమార్ ఏవో వెంకటేశంతో కలిసి పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. అనంతరం ముక్టాపూర్ శివారులో పత్తి విత్తనాలు భూమిలో విత్తడాన్ని పరిశీలించడమే కాకుండా విత్తనాల ప్యాకెట్లను కూడా పరిశీలించారు. ఆయన వెంట డీలర్లు జనార్దన్‌రెడ్డి, రమేష్, తదితరులు ఉన్నారు.

కోహీర్‌లో అధిక ధరలకు ఎరువులు, విత్తనాల విక్రయం!

● **పట్టించుకోని వ్యవసాయ అధికారులు**

కోహీర్, జూన్ 11: మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో ఎరువులు, విత్తనాలను అధికధరలకు విక్రయిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు మాత్రమే ఎరువులు, విత్తనాలు అమ్మాలని అధికారులు ఆదేశించినా దుకాణాల యజమానులు ఇష్టం వచ్చిన ధరలకు అమ్ముతున్నారని రైతులు వాపోతున్నారు. కొన్నవాటికి సంబంధించిన బిల్లులు అడిగితే తమ వద్ద స్టాక్ లేదు వెళ్లిపోమని సమాధానం చెబుతున్నారని పలువురు రైతులు పేర్కొన్నారు. కొన్ని దుకాణదారుల వద్ద విత్తనాలు కొంటేనే ఎరువుల బస్తాలు ఇస్తామని నిబంధన పెట్టడం వలన రైతులు తప్పని పరిస్థితుల్లో విత్తనాల అవసరం లేకున్నా ఎరువుల కోసమైనా కొనాల్సిన దుస్థితి ఏర్పడింది. మండలంలోని చాలా ఫర్టిలైజర్ దుకాణాల్లో ధరల పట్టిక, స్టాక్ బోర్డు పెట్టడం లేదు. వ్యవసాయ అధికారులు దుకాణాల వద్దకు వచ్చి ప్రతి నిత్యం విక్రయాలు, స్టాక్ రిజిస్టర్లను తనిఖీలు చేయాల్సి ఉన్నప్పటికీ సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు ఎరువుల దుకాణాల వైపు కన్నెత్తి చూడడం లేదు. పై అధికారులు ఆదేశించినప్పుడు మాత్రమే మొక్కుబడిగా ఒకటి లేదా రెండు దుకాణాలలో నామ మాత్రపు తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రశ్నిస్తే నో స్టాక్

మండల కేంద్రమైన కోహీర్‌తో పాటు మండల పరిధిలోని దిగ్వాల్, పోతిరెడ్డిపల్లి, కవేలి చౌరస్తా ప్రాంతాల్లో 14 ఫర్టిలైజర్ దుకాణాలు ఉన్నాయి. 45 కిలోల యూరియా బస్తాను రూ.270కి, డీఏపీ రూ.1350కి విక్రయించాలని ప్రభుత్వ ఆదేశాలున్నా కొంత మంది ఎరువుల దుకాణాలు యజమానులు ట్రాన్స్‌పోర్టు ఖర్చుతో కలిపి యూరియాను రూ.300 నుంచి 330 వరకు విక్రయిస్తున్నారు. డీఏపీని రూ.1400 నుంచి 1450 లకు విక్రయాలు చేస్తున్నారు. బిల్లులు అడిగితే ఎరువులు లేవంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఏయే ఎరువుల దుకాణానికి ఎంత మందులు వచ్చాయి. ఏ ధరలకు విక్రయాలు చేశారనేదానిపై విచారణ జరిపి, వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని రైతులు అంటున్నారు.

నర్సాపూర్‌లో ఘనంగా రేణుకాఎల్లమ్మ కల్యాణం



కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

నర్సాపూర్, జూన్ 11: నర్సాపూర్‌లోని రేణుకాఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. నర్సాపూర్ గౌడసంఘం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాల్లో భాగంగా మొదటిరోజైన మంగళవారం అమ్మవారి కల్యాణాన్ని ఎంతో వైభవంతో నిర్వహించారు. కల్యాణోత్సవంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్‌చైర్మన్ నయిమోద్దిన్, బీజేపీ కౌన్సిలర్లు రాజేందర్, బుచ్చేస్‌యాదవ్, యాదగిరి, సురేష్, అసెంబ్లీ కన్వీనర్ రమణరావుతో పాటు ఆయా పార్టీల నాయకులు, గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు. మహిళలు ఈ కల్యాణంలో పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ప్రవేశాలకు లక్కీడ్రా



అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సమక్షంలో లక్కీ డ్రా తీస్తున్న దృశ్యం

సంగారెడ్డి అర్బన్, జూన్ 11: జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ స్కూల్స్‌లో విద్యార్థుల ప్రవేశాలకు సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో మంగళవారం లక్కీ డ్రా నిర్వహించారు. అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ సమక్షంలో లక్కీ డ్రాను తీయించి విద్యార్థులను ఎంపిక చేశారు. జిల్లాలో 1, 5వ తరగతిలో ప్రవేశాలకు ఈ నెల 7 వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద ఎంపికైన విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి అఖిలేష్‌రెడ్డి, అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

సంగారెడ్డి అర్బన్, జూన్ 11: పదోతరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. చివరి రోజు సాంఘిక శాస్త్రం పరీక్ష ప్రశాంతంగా ముగిసింది సంగారెడ్డిలోని కరుణ హైస్కూల్, రామచంద్రాపురంలోని జడ్పీ హైస్కూల్, జహీరాబాద్‌లోని సిద్ధార్థ హైస్కూల్ కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. మొత్తం 48 మందికి గానూ 14 మంది హాజరుకాగా, 34 మంది గైర్హాజరయ్యారు. 29.17 శాతం హాజరు నమోదైందని డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. సంగారెడ్డిలోని కరుణ హైస్కూల్ పరీక్ష కేంద్రాన్ని ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆఫీసర్స్ తనిఖీ చేశారు.

మున్సిపల్ భవన ప్రారంభోత్సవానికి మంత్రికి ఆహ్వానం



మంత్రిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం, జూన్ 11: తెల్లాపూర్ మున్సిపల్ నూతన భవన ప్రారంభోత్సవానికి రావాలంటూ ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర మంత్రి దామోదర్ రాజనర్సింహను ఆహ్వానించారు. సుమారు రూ.9 కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన భవనం, గద్దర్ ఆడిటోరియం శంకుస్థాపన కార్యక్రమాలకు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వెంట మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, కౌన్సిలర్లు పట్లోల రవీందర్‌రెడ్డి, నాగరాజు, బాబ్జీ, శ్రీశైలం, శ్రీపాల్‌రెడ్డి, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

బడిబాట కార్యక్రమం ఏర్పాట్ల పరిశీలన

రాయికోడ్, జూన్ 11: ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్గొననున్నట్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జి.అంజయ్య తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన రాయికోడ్‌లోని జడ్పీ ఉన్నతపాఠశాలలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఉదయం 10 గంటలకు బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బాలాజీనర్సింలు, పీఏసీఎస్ చైర్మన్ నాగొశెట్టిపటేల్,ఎంపీడీవో ఎం.ఏ.శరీఫ్, హెచ్‌ఎం.అంజయ్య, ఏపీఎం నర్సింహులు, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు



చిన్నశంకరంపేటలో రాస్తారోకో చేస్తున్న మహిళలు

చిన్నశంకరంపేట, జూన్ 11: మండల కేంద్రంలోని గాంధీనగర్ కాలనీవాసులు మంగళవారం తాగునీటి కోసం రాస్తారోకో చేపట్టారు. గత మూడు రోజులుగా తమకు మిషన్ భగీరథ నీరు రావడంలేదని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు చేగుంట-మెదక్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఘటనాస్థలానికి చేరుకున్న అధికారులు కాలనీవాసులకు నచ్చజెప్పి ట్యాంకర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించారు.

రైతునేస్తంతో రైతులకు ప్రయోజనం: ఏడీఏ

జహీరాబాద్, జూన్ 11: రైతుల ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకుని రైతునేస్తం కార్యక్రమాలను చేటపట్టినట్టు జహీరాబాద్ వ్యవసాయ శాఖ ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. మంగళవారం జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని రంజోల్ గ్రామంలో గల రైతు వేదికలో రైతునేస్తం కార్యక్రమం నిర్వహించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉన్నతాధికారుల వీడియో సందేశాన్ని రైతులు, అధికారులు విన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతు ఈ కార్యక్రమం ద్వారా రైతులకు వ్యవసాయ సంబంధిత విషయాలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఏవోలు ప్రవీణ, లావణ్య, వినోద్‌కుమార్, నవీన్‌కుమార్, ఏఈవోలు ప్రదీప్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

మార్డి ఉన్నత పాఠశాల విద్యార్థినికి ప్రతిభా పురస్కారం

కల్హేర్, జూన్ 11: మండల పరిధిలోని మార్డి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని బి.వర్ష పదో తరగతిలో 10 జీపీఏ సాధించగా ఆమెకు సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రబారతిలో జరిగిన కార్యక్రమంలో ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. రవీంద్రబారతిలో వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కార అవార్డుల ప్రధానోత్సవంలో బి. వర్ష, పాఠశాల హెచ్‌ఎం శైలజలను ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవిందర్ అవార్డులను ప్రదానం చేశారు.

మిషన్ భగీరథ సర్వేను పరిశీలించిన ఆర్డీవో

మనోహరాబాద్, జూన్ 11: మండలంలోని రామాయపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ నీటి సరఫరా తీరు సర్వేను మంగళవారం తూప్రాన్ ఆర్డీవో జయచంద్రరెడ్డి పరిశీలించారు. రాష్ట్ర వ్యాప్తంగా మిషన్ భగీరథ నల్లాల నీటి సరఫరా తీరు పరిశీలించేందుకు ఇంటింటి సర్వే చేపట్టారు. మంగళవారం రామాయపల్లి గ్రామంలో జరుగుతున్న సర్వేను ఓ ఇంటి వద్ద పరిశీలించి కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డిని అడిగి వివరాలను తెలుసుకున్నారు. మండలలో ఎక్కడ ఎలాంటి పొరపాట్లు లేకుండా సర్వే నిర్వహించాలని అధికారులకు తెలిపారు. అనంతరం రామాయపల్లి ఉన్నత పాఠశాల బడిబాట ర్యాలీలో పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

మునిపల్లి, జూన్ 11: మహిళలు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్డీఏ పీడీ జ్యోతి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని పెద్దచెల్మడ గ్రామంలో మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఆర్డీఏ పీడీ మాట్లాడుతూ మునిపల్లి మండలంలో మొత్తం 4,620 మంది విద్యార్థిని, విద్యార్థులు ఉన్నారని, వారికి సకాలంలో స్కూల్ డ్రెస్సులు అందించాలన్నారు. ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు ప్రాధాన్యత ఇస్తుందని, పాఠశాలలో జరిగే పనులకు సంబంధించి అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో ఏపీఎం బాగయ్య సీసీ నాగమణి, సుధాకర్, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్

సంగారెడ్డి అర్బన్, జూన్ 11: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం(టీఎస్‌జీఆర్‌ఈఏ)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.చంద్రశేఖర్ కోరారు. సంగారెడ్డిలోని ముదిరాజ్ సంఘం భవన్‌లో మంగళవారం నాల్గవ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ పెండింగ్ డీఏ మంజూరు చేయాలని, ఈహెచ్‌ఎస్ నగదు రహిత వైద్య చికిత్స, క్వాంటం పెన్షన్ వయస్సు తగ్గింపు, కమ్యూటేషన్ వయస్సు 15 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాలకు తగ్గింపు, సత్వర పెన్షనర్ల బకాయిలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా అధ్యక్షుడు నర్సారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి మురళీధర్, కోశాధికారి బసవేశ్వర్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ బక్కారెడ్డి, కార్యవర్గసభ్యులు, మండల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.